# పెళ్ళికూతురు



డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి

పేషెంట్ చెప్పేకథలు

మంగళ వాయిద్యాలు పడుచుగుండెల్లో మరుమల్లెల జల్లుల్ని కురిపిస్తున్నాయి. పెళ్ళికూతురు వరలక్ష్మి ముస్తాబవుతూంది. కొంచెం దూరంలో కూర్చుని వరలక్ష్మిని చూస్తున్న శ్రుతికి ఆమెతో తన మొదటి పరిచయం గుర్తుకొచ్చింది.

"గుడ్ మార్నింగ్ డాక్టర్!" నవ్వే సెలయేరులా, ప్రతుళ్ళిపడే జలపాతంలా వున్న ఆ అమ్మాయి వంక ఒక్కక్షణం ఆసక్తిగా చూస్తూ వుండిపోయింది శ్రుతి.

"మా అమ్మగారికి కొంచెం ఒంట్లో బాగాలేదు. మీరు టెస్ట్‌చేసి మంచి మందులు రాసివ్వండి" నొక్కులు నొక్కుల పొడవాటి జుట్టుతో, చారెడేసి కళ్ళతో, సంపంగి ముక్కుతో, నున్నగా మెరుగులీనుతున్న చెక్కిళ్ళతో, పసిమిరంగుతో బాపూ బొమ్మలా నాజూగ్గా, సుకుమారంగా వున్న వరలక్ష్మి తరువాత చాలాసార్లు శ్రుతి దగ్గరకు వచ్చింది.

ఒక పాదానికి పారాణిపెట్టుకుని, రెండో పాదం కొంచెం ముందుకు చాపి పారాణి పెట్టుకుంటున్న వరలక్ష్మి కళ్ళముందు సత్పృతుల పరదా లొక్కొక్కటీ జారుతున్నాయి. కుసుమించిన యౌవనం, అలరించే లావణ్యం, కొత్తగా దొరికిన చిరుద్యోగం, ఊహలు, కోరికలు, సుందర స్వప్నాలు. ఈ క్షణం గురించి ఎన్ని అందమైన ఊహల్ని పేర్చుకునేది తను! ఎన్నెన్ని మధుర భావనలతో తూగిపోయేది తను! కాని.... కరుణించని కాలం పదిహేను సుదీర్ఘ సంవత్సరాల తరువాతకు విసిరేసిందీ క్షణాన్ని. యిన్నాళ్ళ తన నిరీక్షణ, యిన్నేళ్ళ తన తపన యిప్పుడు ఫలించబోతున్నాయి. పది సంవత్సరాల క్రితం తన తలుపు తట్టిన అవకాశాన్ని యిప్పుడు అంది పుచ్చుకుంది. తనవాళ్ళ స్వార్థం తన కోరికల్ని ఉరితీస్తూందనే విషయాన్ని తనానాడే గుర్తించివుంటే, తన బాధ్యతలకంటే తన జీవితమే తనకు ముఖ్యమనే రవ్వంత స్వార్థానికి చోటిచ్చివుంటే ఎంత బావుండేది?!....పదేళ్ళనాడే తనను యిష్టపడి తన జీవితంలోకి అపురూపంగా ఆహ్వానించిన భాస్కర్రావు భార్య అయుండేది. తన గుండె లోతుల్లో యింకా బ్రతికేవున్న కోరిక, పెళ్ళికూతురి అలంకరణతో కళ్యాణ వేదికపై అడుగుపెట్టాలనే అందమైన కల ఆనాడే నిజమయుండేది....వరలక్ష్మి కళ్ళల్లో కన్నీటి కడలి, హృదయంలో ఫలించని ఆశల ఘోష.

శ్రుతి వరలక్ష్మిని గమనిస్తూంది. పదేళ్ళుగా ఆమె జీవితంలో జరిగిన ముఖ్య ఘట్టాలన్నీ శ్రుతికి తెలుసు. ఆమె సంతోషంగా తనకై తాను తలకెత్తుకున్న బాధ్యతలు, ఆ బాధ్యతల భారంతో ఆమె తల వంగిపోవడం, భాస్కర్రావుని తిరస్కరించేలా చేసిన అయినవాళ్ళ స్వార్థం, మరణశయ్యమీదున్న తల్లికిచ్చినమాట నిర్దాక్షిణ్యంగా ఆమె బ్రతుకును నలిపేయడం— బాధ సుళ్ళు తిరిగింది శ్రుతి హృదయంలో.

అన్ని బాధ్యతల్నుండి విముక్తిపొందిన వరలక్ష్మి ఐదేళ్ళనుంచి తోడుకోసం వెదుక్కుంటూంది. మారిపోయిన రూపురేఖలు, జారిపోతున్న యౌవనం, సౌకుమార్యాన్ని కోల్పోయిన కదలికలు.... ఎన్నో ఆశాభంగాల్ని సహించి, విసిగి వేసారి యింక వివాహ ఘట్టాన్ని శాశ్వతంగా మరిచిపోదామనుకునే సమయంలో పదేళ్ళనాడు ఆమె తిరస్కృతిని మౌనంగా భరించి వెళ్ళిపోయిన భాస్కర్రావుకు మళ్ళీ ఈ ఊరికి ట్రాన్స్‌ఫర్ అయింది. పాత పరిచయం, స్నేహం, సాన్నిహిత్యం కొత్త మలుపుకు తిరిగాయి. పెళ్ళయిన ఏడాదికే భార్యను పోగొట్టుకున్న భాస్కర్రావు, ముప్ఫై అయిదేళ్ళు నిండిపోయిన వరలక్ష్మి, ఇద్దరూ ఎవరికి వాళ్ళు సంకోచంతో నిలబడిపోయారు. చివరకు వరలక్ష్మే ధైర్యంచేసి అడుగు ముందుకు కదిపింది.

తీరా ఒక నిర్ణయాని కొచ్చాక వరలక్ష్మికో సందేహ మొచ్చింది.

"డాక్టరుగారూ! నా వయసింత ముదిరిపోయిందికదా, పిల్లలు పుట్టే అవకాశముందా అసలు నాకు?" బేలగా చూస్తూ అడిగింది వరలక్ష్మి.

"ఎందుకు లేదమ్మా? ఇంకా పది సంవత్సరాల వరకు నీకు పిల్లలు పుట్టడాని కవకాశముంది. నువ్విలాంటి అనుమానాలు పెట్టుకోకుండా సంతోషంగా పెళ్ళి చేసుకో" ధైర్యం చెప్పి పంపింది శ్రుతి.

భాస్కర్రావు రిజిష్టర్ మేరేజ్ చేసుకుందామని అంటున్నా వినకుండా సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా తన పెళ్ళి జరగాలని పట్టుబట్టింది వరలక్ష్మి. దగ్గర బంధువులు, ఫ్రెండ్స్, కొలీగ్స్...అంతా వచ్చారు. ఆ సంరంభం, ఆ అలజడి, ఆ ఉత్సాహం, ఆ ఉద్వేగం....చిత్రమైన మనఃస్థితిలోవుంది వరలక్ష్మికి.

చేతులకు ఎర్రరంగుతో గోరింటాకులా పెట్టుకుంటూ దగ్గరకువచ్చిన వాళ్ళందరినీ తన అలంకరణ ఎలా వుందని అడుగుతూంది వరలక్ష్మి. ఆమెతో బావుందని చెప్పి చాటుకు వెళ్ళి చెయ్యి అడ్డం పెట్టుకుని ఎగతాళిగా నవ్వుకుంటున్నారు. గుసగుసగా చెప్పుకుంటూ ఎద్దేవా చేస్తున్నారు. వరలక్ష్మిని, వాళ్ళనూ చూస్తూంటే శ్రుతికి బాధగా వుంది. జాలిగా వుంది. తమాషాగావున్న ఆమె రూపాన్నీ, అలంకరణనూ చూస్తే వెగటుగానూ వుంది.

"మేడమ్! ఎలా వుంది? బావున్నానా?" ఆశగా అడిగింది వరలక్ష్మి. విషాదాన్ని గుండెల్లో అణచుకుని ముఖానికి చిరునవ్వును పులుముకుని పెదవి విప్పబోయింది శ్రుతి.

"అమ్మవారిలా ఆ అలంకరణేమిటి?— పన్నెండేళ్ళ బాలాకుమారి ననుకుంటూంది కాబోలు!" వరలక్ష్మి చిన్న తమ్ముడి భార్య ఆలివేణి కావాలనే బిగ్గరగా అని విసుక్కుని నవ్వింది.

గురి బాగా కుదిరింది. గాయంలోతుగా అయింది. ఆ లోతుల్ని స్పృశించి ఉపశమనం కలిగించే మందు శ్రుతిదగ్గర లేదు. ●